క్లుప్తంగా

రోడ్డు మధ్యలోని స్తంభం తొలగింపు



స్తంభాన్ని తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి స్పందన

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ లక్ష్మీపురంలో రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. దీనిపై 'స్తంభం తొలగించకుండానే సీసీ రోడ్డు వేశారు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు గోదావరిఖని ఏడీఈ శ్రీనివాస్, ఏఈ మైపాల్ రెడ్డి మంగళవారం ఆ స్తంభాన్ని తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిక



చంద్రయ్యను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాంతానికి చెందిన టీడీపీ కార్మిక సంఘం సీనియర్ నాయకుడు కంది చంద్రయ్య మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ కండువా కప్పి, ఆహ్వానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఎన్టీపీసీ పట్టణ శాఖ అధ్యక్షుడు ఆసిఫ్ పాషా, నాయకులు పాల్గొన్నారు.

లాఠీచార్జి చేసిన పోలీసులపై చర్య తీసుకోవాలి

పెద్దపల్లిరూరల్: పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే ఉపాధ్యాయులకు రెమ్యునరేషన్ చెల్లించడంలో తేడా ఎందుకని ప్రశ్నించిన ఉపాధ్యాయ సంఘ నాయకులపై నారాయణఖేడ్ ఆర్డీవో లాఠీచార్జి చేయించడం దారుణమని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాంపల్లి లక్ష్మణ్, గద్దె శ్రీనివాస్ ఒక ప్రకటనలో అన్నారు. లాఠీచార్జిలో ఉపాధ్యాయ సంఘ నాయకులు లక్ష్మారెడ్డి తదితరులు గాయపడ్డారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి, ఆర్డీవోతోపాటు పోలీసులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హనుమాన్ ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న హనుమాన్ దీక్షాపరులు

సుల్తానాబాద్: పట్టణంలోని మార్కండేయ కాలనీ పెరిగిద్దె హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షాపరులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భజన చేశాక భిక్ష చేపట్టారు.

తారుపల్లిలో కళాజాత



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని తారుపల్లిలో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం వారు కళాజాత నిర్వహించారు. బేటీ బచావో–బేటీ పడావో, పరిశుభ్రత పాటిస్తేనే ప్రతి ఒక్కరికీ ఆరోగ్యం, ఇంకుడు గుంతలు తవ్వండి–దోమలను నివారించండి, యువత వాహనాలు జాగ్రత్తగా నడపండి–విలువైన భవిష్యత్తు కాపాడుకోండి, వేగం వద్దు–ప్రాణం ముద్దు, వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండు–విద్యతో విజ్ఞానం పెంపొందించుకో అంటూ సామాజిక అంశాలతోపాటు ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల పథకాలపై ప్రజలను చైతన్య పరిచారు. కార్యక్రమంలో కళా బృందం సభ్యులు కొండ్ర వెంకన్న, సలేంద్ర రాజన్న, ఈదునూరి పద్మ, జిన్న రమాదేవి, కన్నూరి రేణుకాదేవి, జనగామ రాజనర్సు, ఇల్లందుల మల్లేశం గౌడ్, బుర్ర శంకర్ గౌడ్ పాల్గొన్నారు.



గర్రెపల్లి చెరువులో పని చేస్తున్న కూలీలు



కదంబపూర్‌లో..



కనుకుల గ్రామంలో..

జోరందుకున్న ఉపాధిహామీ పనులు

సుల్తానాబాద్‌రూరల్: గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జోరందుకున్నాయి. వ్యవసాయ పనులు ముగియడంతో మహిళలు అధిక సంఖ్యలో హాజరవుతున్నారు. సుల్తానాబాద్ మండలంలోని 27 గ్రామాల్లో నిత్యం 3,600 మంది కూలీలు పనికి వెళ్తున్నట్లు ఏపీవో మల్లీశ్వరి తెలిపారు. మొత్తం 11,047 జాబ్ కార్డులున్నాయి. ఇందులో 5,413 మంది యాక్టివ్ జాబ్ కార్డుదారులుండగా 3,600 మంది కార్డుదారులు(కూలీలు) పనులకు వెళ్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు పని చేస్తుండగా ఒక్కొక్కరికి రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. అయితే, చేసిన పనిని బట్టి ప్రతీరోజు రూ.215 నుంచి రూ.250 వరకు కూలీ గిట్టుబాటు అవుతోంది. మిగతా కూలీలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏపీవో సూచించారు.

బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలకు ఎన్నేళ్లు?

- శంకుస్థాపన చేసి, ఆరేళ్లయినా ప్రారంభం కాలే..
- అందుబాటులోకి వస్తే 20 వేల ఎకరాలకు సాగు నీరు
- రామగుండం నియోజకవర్గ రైతుల నిరీక్షణ



బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల పంపుహౌస్



ఆరేళ్ల కిందటి శంకుస్థాపన శిలాఫలకం

రామగుండం: నియోజకవర్గ పరిధిలో 20 వేల ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు సమృద్ధిగా సాగు నీరందించేందుకు గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలకు శ్రీకారం చుట్టారు. దీన్ని ఎస్సారెస్పీ కాలువలకు అనుసంధానించి చివరి ఆయకట్టుకు నీరందించేందుకు రూ.75.74 కోట్లతో 2018 ఫిబ్రవరి 27న అప్పటి సీఎం కేసీఆర్ చేతులమీదుగా పనులకు శంకుస్థాపన చేశారు. ఆరు మాసాల వ్యవధిలో బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలతో చివరి ఆయకట్టును స్థిరీకరిస్తామని ఆయన రైతులకు హామీ ఇచ్చారు. కానీ, ఆరేళ్లు గడుస్తున్నా పనులు నత్తనడకన కొనసాగుతుండటంపై అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

చెంతనే 'ఎల్లంపల్లి'.. అందని సాగునీరు

ఎల్లంపల్లి ప్రాజెక్టు అంతర్గాం మండలంలోనే ఉన్నప్పటికీ దాని చెంతనే ఉన్న భూములతోపాటు మండల పరిధిలో ఆయకట్టుకు చుక్క నీరందలేదు. అదే సమయంలో వేలాది క్యూసెక్కుల ప్రాజెక్టు నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు తరలించడం, మంథని నియోజకవర్గంలో చెరువులు, కుంటలను నింపడం, ఎన్టీపీసీ, మిషన్ భగీరథ, ఆర్‌ఎఫ్‌సీఎల్ పరిశ్రమల అవసరాలకు సైతం పంపింగ్ జరుగుతుండటంతో స్థానికుల నుంచి విమర్శలు వచ్చాయి. దీంతో రామగుండం నియోజకవర్గ పరిధిలో భూములకు నీరందించేందుకు బ్రాహ్మణపల్లి ఎత్తిపోతల పథకానికి రూపకల్పన చేశారు. అయితే, పనులు ప్రారంభించాక రెండేళ్లు కోవిడ్, కొంతకాలం వరదలు, నిధులు సకాలంలో మంజూరు కాకపోవడం, ప్రభుత్వ మార్పు తదితర కారణాలతో నత్తనడకన సాగుతున్నాయి. దీంతో రైతులు సాగునీటి కోసం నిరీక్షిస్తున్నారు.

ఎత్తిపోతల ముఖ్య ఉద్దేశం ఇదీ..

అంతర్గాం, పాలకుర్తి మండలాల్లో చివరి ఆయకట్టుకు సాగు నీరందించేందుకు బ్రాహ్మణపల్లి ఎత్తిపోతలను ఎస్సారెస్పీ కాలువలకు అనుసంధానించారు. ఇందులో భాగంగా ఎస్సారెస్పీ డీ–83 కాలువ ద్వారా 27ఎల్, 17ఎల్ ఉప కాలువలను అనుసంధానించి, సాగునీటి సరఫరా జరిగేలా డిజైన్ రూపొందించారు. ఇందుకు ఎత్తిపోతల పంపుహౌస్ నుంచి 27ఎల్, 17ఎల్ ఉప కాలువలకు లింక్ అయ్యేలా పైపులైన్ సైతం వేశారు.

యాసంగికి ప్రారంభిస్తాం

ఇప్పటికే ఎత్తిపోతల పంపుహౌస్‌లో మోటార్ల ఎరక్షన్ పనులు వంద శాతం పూర్తయ్యాయి. విద్యుత్ కనెక్షన్ ఇవ్వడమే ఆలస్యం. ఇటీవల ప్రత్యేక సబ్‌స్టేషన్ నిర్మాణానికి గానూ రూ.2 కోట్లు ఎన్పీడీసీఎల్‌కు చెల్లించాం. ఆ సంస్థ సబ్‌స్టేషన్ నిర్మించాల్సి ఉంది. మూడు మాసాల్లో పూర్తవుతుంది. వచ్చే యాసంగి సీజన్ నాటికి ఎత్తిపోతలు ప్రారంభిస్తాం.

– బుచ్చిబాబు, జేఈ, నీటిపారుదల శాఖ

రాజాపూర్‌ను పూర్తిగా తీసుకోండి



గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు, హాజరైన గ్రామస్తులు

- అలా అయితేనే సింగరేణికి భూములిస్తాం
- మా డిమాండ్లకు అంగీకరించకపోతే వెళ్లిపోండి
- భూ సేకరణ గ్రామసభలో తేల్చిచెప్పిన గ్రామస్తులు

రామగిరి: మా గ్రామాన్ని పూర్తిగా తీసుకోండి.. అప్పుడే సింగరేణి ఓసీపీకి భూములిస్తాం.. మా ప్రధాన డిమాండ్లను అంగీకరించకపోతే వెళ్లిపోండి అని రాజాపూర్ గ్రామస్తులు తేల్చిచెప్పారు. మంగళవారం ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 విస్తరణకు భూసేకరణలో భాగంగా రాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో సింగరేణి యాజమాన్యం గ్రామసభ నిర్వహించింది. పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. గతంలోనే బుధవారంపేట, రాజాపూర్ గ్రామాల్లో అవార్డు ప్రకటించి, తీరని అన్యాయం చేసిన సింగరేణి అధికారుల మాటలు నమ్మబోమన్నారు. 708 ఎకరాలకు అవార్డు పాస్ చేసి, రద్దు చేయడంతో ఏడేళ్లుగా రైతుబంధు రాలేదని, సుమారు 30 మంది రైతులు చనిపోయారని వారికి రైతు బీమా రాలేదని పేర్కొన్నారు. ఆ మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజాపూర్‌ను మొత్తం తీసుకోవాలని, మిగిలిన అరకొర భూమిలో నివాసం ఉండలేమన్నారు. లద్నాపూర్‌లో ఓసీపీలకు భూములిచ్చి తీవ్రంగా నష్టపోయిన రైతులను చూస్తున్నామని, వారికి న్యాయం చేయకుండా సింగరేణి అధికారులు సృష్టిస్తున్న అడ్డంకులను గమనిస్తున్నామని తెలిపారు. తమ డిమాండ్లను అంగీకరించకపోతే ఇక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ అధికారులతో వాగ్వాదానికి దిగారు. 88 ఎకరాల భూ సేకరణకు ఒప్పుకోమని గతంలో మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్‌లకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ.. రైతులకు అన్యాయం చేయబోమని, స్థానికులకు స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఉపాధి కల్పిస్తామని తెలిపారు. సింగరేణిలో ఔట్‌సోర్సింగ్ విభాగంలో ఉద్యోగాలిస్తామని, భూ సేకరణ చట్టానికి లోబడే నిర్ణయాలు ఉంటాయని పేర్కొన్నారు. కానీ, గ్రామస్తులు ఇవేవీ వినలేదు.. తీసుకుంటే గ్రామాన్ని మొత్తం తీసుకోండి.. లేదంటే లేదంటూ వెళ్లిపోయారు.

ఊరిని మొత్తం తీసుకోవాలి



రాజాపూర్ మొత్తాన్ని తీసుకోవాలి. 88 ఎకరాల భూములు సింగరేణికి ఇచ్చి, ఇక్కడే ఉంటే అనారోగ్యానికి గురవుతామని ఆందోళన చెందుతున్నారు. ఊరిని తీసుకొని, పునరావాసం కల్పించి, పిల్లలకు శాశ్వత ఉపాధి చూపాలి. ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలి.

– ఆరెల్లి దేవక్క, ఎంపీపీ, రామగిరి

గ్రామస్తులు సహకరించాలి



ఓసీపీ–2 విస్తరణకు రాజాపూర్ గ్రామస్తులు సహకరించాలి. గని భవిష్యత్తు దృష్ట్యా 88 ఎకరాల భూ సేకరణకు నిర్ణయించాం. నిర్వాసితులకు ఉపాధి కల్పిస్తాం. ఇళ్లకు సంబంధించిన వివరాలను ఉన్నతాధికారులకు అందిస్తాం.

– ఎన్.సుధాకర్‌రావు, ఆర్జీ–3 జీఎం

మెజార్టీ ఎంపీ సీట్లు కాంగ్రెస్‌వే

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



పెద్దపల్లిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను సన్మానిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్: రాష్ట్రంలో మెజార్టీ ఎంపీ సీట్లు కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వగ్రామం కాటారం మండలం దన్వాడలోని దత్తాత్రేయ స్వామి ఆలయ మూడో వార్షికోత్సవానికి వెళ్తున్న ఆయనకు సుల్తానాబాద్‌లో స్థానిక నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలుకు కార్యాచరణ సిద్ధమైందన్నారు. ఎన్నికలప్పుడే పార్టీలు ఉండాలని, ఆ తర్వాత అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి సోదరుడు శ్రీనుబాబు, సర్పంచ్‌ల ఫోరం ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు అంతటి అన్నయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దన్నాయక్ దామోదర్ రావు, సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, పార్టీ మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, నాయకులు పాల్గొన్నారు

పెద్దపల్లిరూరల్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పెద్దపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు మంగళవారం ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన కారులోనే కాటారం మండలంలోని దన్వాడ వెళ్లారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

రామగిరి: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు బ్లాక్ కాంగ్రెస్ మంథని అధ్యక్షుడు తోట్ల తిరుపతి యాదవ్ మంగళవారం ఘన స్వాగతం పలికారు. ఆయనను నాగెపల్లిలోని తన ఇంటికి ఆహ్వానించి, శాలువాతో సన్మానించారు. పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కొలిపాక సుజాత, నాయకులు కోట రవీందర్ రెడ్డి, తోట చంద్రయ్య, ఆరెల్లి దేవక్క, కెక్కర్ల స్వరూప, రంగం దశరథం తదితరులున్నారు.

కమాన్‌పూర్: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు కమాన్‌పూర్ ఎక్స్‌రోడ్డు వద్ద కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వైనాల రాజు ఆధ్వర్యంలో ఆయనతోపాటు పెద్దపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు విజయరమణారావు, మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌లను సన్మానించారు. సింగిల్‌విండో చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, నాయకులు కోలేటి మారుతి, ఇనగంటి రామారావు, పీట్ల గోపాల్, మల్క రామస్వామి, అన్వర్, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఎంపీగా వంశీకృష్ణ గెలుపు ఖాయం'

ముత్తారం: పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడిగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ అన్నారు. మంగళవారం ముత్తారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మంత్రి, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబుపై నమ్మకంతో ముత్తారం మండల ప్రజలు కాంగ్రెస్ పార్టీకి ఓటేశారని, వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

ఉన్నత చదువులకు అండగా నిలుస్తా

- కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్

రామగుండం: అంతర్గాం మండలంలోని పెద్దంపేటకు చెందిన ఎలిగేటి కుమార్ ఆరేళ్ల క్రితం మృతిచెందాడు. అప్పటినుంచి అతని భార్య పావని కూలీ పనులు చేసుకుంటూ తన ఇద్దరు కూతుళ్లను చదవిస్తోంది. ఈ క్రమంలో మంగళవారం కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఆ కుటుంబసభ్యులను కలిశారు. విద్యార్థినులకు స్టేషనరీ అందజేసి, ఉన్నత చదువులకు అండగా నిలుస్తానని భరోసా కల్పించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపజేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు మేర్గు కుమార్‌గౌడ్, నాయకులు తమ్మనవేణి కుమార్, ఊరటి మహేశ్, పెండ్యాల వెంకటేశ్, పెద్దల రమేశ్ తదితరులున్నారు.

'ఆధార్'ను లాక్ చేసుకోండి



జ్యోతినగర్: ప్రతీఒక్కరికి ఆధార్ ప్రధాన గుర్తింపుగా ఉంది. అందరి వ్యక్తిగత సమాచారం అందులో నిక్షిప్తమై ఉంటుంది. దాని ఆధారంగా చోరులు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారు. అందులోని వ్యక్తిగత సమాచారాన్ని కొందరు డార్క్ వెబ్‌లో విక్రయిస్తున్నట్లు కూడా తెలుస్తోంది. మన ఆధార్‌ను ఇతరులు ఉపయోగించకుండా లాక్ చేసుకోవాలని నిపుణులు తెలియజేస్తున్నారు. బయోమెట్రిక్ సమాచారం సురక్షితంగా ఉంచుకోవడం కోసం చేయాల్సిన ముఖ్య విషయాలను తెలుసుకుందాం..

- యూఐడీఏఐ ద్వారా ఆధార్ జారీచేస్తున్నారు. ప్రత్యేక సౌకర్యంతోపాటు బయోమెట్రిక్ సమాచారాన్ని కావలసినంతకాలం వరకు లాక్ చేయవచ్చు. మళ్లీ అన్‌లాక్ చేసే వరకూ ఎవరు కూడా దానిని ఉపయోగించలేరు.

లాక్ చేయడం ఇలా..

- యూఐడీఏఐ వెబ్‌సైట్‌ని ఓపెన్ చేయడం లేదా మొబైల్ ఫోన్‌లో ఎంఆధార్ (ఝఅ్చ్ఛీజ్చ్చిట) యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- ఆధార్ నంబర్, ఓటీపీ నమోదు చేయడం ద్వారా లాగిన్ అవ్వాలి.
- ఇక్కడ 'నా ఆధార్' విభాగంలో, 'లాక్/అన్‌లాక్ బయోమెట్రిక్స్' ఎంపిక చేయాలి.
- గుర్తింపును ధ్రువీకరించడానికి ఆధార్ నంబర్‌తో పాటు ఓటీపీని నమోదు చేయాలి.
- ఆధార్ బయోమెట్రిక్ సమాచారాన్ని సురక్షితంగా ఉంచడానికి 'లాక్ బయోమెట్రిక్స్' ఎంపిక చేసుకోవాలి.
- ప్రక్రియ పూర్తయిన తర్వాత, బయోమెట్రిక్ సమాచారం లాక్ అయినట్లు నిర్ధారణ సందేశం వస్తుంది.
- ఎప్పుడైనా బయోమెట్రిక్ సమాచారాన్ని తర్వాత అన్‌లాక్ చేయాలనుకుంటే, అదే విధానాన్ని పునరావృతం చేయాలి.
- 'అన్‌లాక్ బయోమెట్రిక్స్' ఎంపిక చేసుకోవాలి.

ప్రయోజనాలు ఇవీ..

ఆధార్ బయోమెట్రిక్‌ను లాక్ చేయడంతో ప్రయోజనాలు ఉంటాయి. బయోమెట్రిక్ సమాచారం లాక్ చేసినప్పుడు వేలిముద్ర, కనుపాపల స్కాన్ లేదా ముఖ గుర్తింపు డేటాను ఎవరూ ఉపయోగించలేరు. ఆధార్ ధ్రువీకరణ కోసం, ఓటీపీ రిజిస్టర్డ్ మొబైల్ నంబర్‌కు మాత్రమే పంపిస్తారు. తద్వారా ఆధార్ ధ్రువీకరిస్తారు.

వారసంత.. ప్రమాదాల చింత

- రాష్ట్ర రహదారిపైనే క్రయవిక్రయాలు
- భారీ వాహనాల రాకపోకలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- ధర్మారం మండల కేంద్రంలో పరిస్థితి



రోడ్డుకిరువైపులా టెంట్లు వేసుకున్న చిరువ్యాపారులు

ధర్మారం: మండల కేంద్రంలో ప్రతీ మంగళవారం నిర్వహించే వారసంతతో అటు వినియోగదారులు ఇటు వ్యాపారులు నానాతంటాలు పడుతున్నారు. ఈ సంతకు ప్రత్యేకంగా స్థలం కేటాయించకపోవడంతో రాష్ట్ర రహదారితోపాటు వేశ్య గృహాల నుంచి ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే రోడ్డుకిరువైపులా వ్యాపారులు టెంట్లు వేసుకొని, క్రయవిక్రయాలు కొనసాగిస్తున్నారు. రాష్ట్ర రహదారిపై భారీ వాహనాల రాకపోకలతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

ఏటా రూ.లక్షల్లో ఆదాయం..

వారసంత ద్వారా గ్రామ పంచాయతీకి ఏటా రూ.లక్షల్లో ఆదాయం సమకూరుతోంది. కానీ, వ్యాపార లావాదేవీలు, వినియోగదారుల సౌకర్యార్థం ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దాదాపు మూడు దశాబ్దాలుగా రోడ్డుపైనే వారసంత నిర్వహణ సాగుతోంది. దీంతో రోడ్డుపై వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది.

5 మండలాలకు కేంద్ర బిందువు..

ధర్మారం మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే వారసంత 5 మండలాల ప్రజలకు కేంద్ర బిందువుగా ఉంది. ధర్మారంతోపాటు వెల్గటూర్, ఎండపల్లి, పాలకుర్తి, గొల్లపల్లి మండలాలతోపాటు లక్సెట్‌పేట, చొప్పదండి మండలాల నుంచి రైతులు, ప్రజలు, వ్యాపారులు ఇక్కడికి వస్తుంటారు. అన్ని రకాల వస్తువులు, నిత్యావసరాలను తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. ఇక్కడ తాజా కూరగాయలు లభిస్తుండటంతో వేలాది మంది వినియోగదారులు సంతకు వస్తారు. ఫలితంగా వారసంత ప్రాంతం ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీగా ఉంటుంది.

నెరవేరని హామీలు..

వారసంత నిర్వహణకు స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో ప్రభుత్వ స్థలం కేటాయించి, షెడ్లు నిర్మించాలని యువజన సంఘాల ఆధ్వర్యంలో అధికారులకు వినతిపత్రాలు అందించారు. అయితే, ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. ప్రస్తుత ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రత్యేక చొరవ తీసుకొని, సంతకు స్థలం కేటాయించి, షెడ్లు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

'ప్రధాని మోదీ పాలన వైపే ప్రజల మొగ్గు'



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్, పక్కన నాయకులు

పెద్దపల్లిరూరల్: పదేళ్లలో నీతివంతమైన పాలన అందించి, ప్రపంచ వ్యాప్తంగా దేశకీర్తి, ప్రతిష్టలను ఇనుమడింపజేసిన ప్రధాని మోదీ పాలన వైపే ప్రజలు మొగ్గు చూపారని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ఉండాలని ప్రజలు స్వచ్ఛందంగా కోరుకుంటున్నారని, ఇందుకు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు చూపిన ఆదరాభిమానాలే నిదర్శనమన్నారు. బీజేపీ అభ్యర్థి గోమాస శ్రీనివాస్ 2లక్షల మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు కావేటి రాజ్‌గోపాల్, నాయకులు చిలారపు పర్వతాలు, దాడి సంతోష్, తంగెడ రాజేశ్వర్‌రావు, రాజం మహంత, పోల్సాని సంపత్‌రావు, ఈర్ల శంకర్, రమేశ్, కోదాటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శ'లో ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభం

ఓదెల: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియట్ ఫస్టియర్ అడ్మిషన్ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జావీద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విభాగాల్లో సీట్లకు ఈ నెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.